01ATP18F_01ATP18F.qxd 18-03-2024 PM 11:39 Page 1



అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 19 మార్చి 2024 పేజీలు : 04

# ఈవిఎంల ఫస్ట్‌లెవల్ చెకింగ్ కార్యక్రమం

**- పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి**



ఈవిఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

**అనంతపురం కలెక్టరేట్, మార్చి 18 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్‌లో వున్న ఈవిఎంల గోడౌన్‌లో సోమవారం శ్రీసత్యసాయి జిల్లా నుండి వచ్చిన 94 ఈవిఎంలను ఫస్ట్‌లెవల్ చెకింగ్ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పరిశీలించారు.

ఈవిఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బెల్ కంపెనీ నుండి వచ్చిన ఇద్దరు ఇంజనీర్ల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించి ఎన్నికల కమీషన్ నియమ నిబంధనల ప్రకారం సజావుగా ఎఫ్ఎల్‌సి కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాషిక తనిఖీల్లో భాగంగా పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్‌లో వున్న ఈవిఎంలు భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.

ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనర్ మేఘస్వరూప్, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, డిపిఓ ప్రభాకర్‌రావు, వైసిపి ప్రతినిధి శ్రీనివాసులు, టిడిపి ప్రతినిధి చెరకుతోట పవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎంఎండి ఇమామ్, బిఎస్‌పి అంజయ్య, ఆమ్ ఆద్మీ ప్రతినిధి మసూద్‌వలి, బిజెపి ప్రతినిధి ఈశ్వర్‌ప్రసాద్, సిపిఎం ప్రతినిధి బాలరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీని ఆంధ్రకు ఎలా ఆహ్వానించారు

**- ఎన్డీఏ కూటమి పేదలకు వ్యతిరేకం - మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్**



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

**అనంతపురం, మార్చి 18 ప్రభాతవార్త బ్యూరో**

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పదేళ్లలో ఆంధ్రకు చేసిందేమీ లేదు. రాష్ట్ర హక్కులకు భంగం కలిగించే విధంగా కర్ణాటకలో అప్పర్‌భద్ర ప్రాజెక్టు నిర్మించడానికి నిధులు ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎలా ఆహ్వానించారని మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్ ప్రత్యేకంగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిలకలూరి పేటలో ప్రజాగళం పేరుతో నిర్వహించిన సభ తీరును తప్పు బట్టారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కేటమికి 400 ఎంపి సీట్లు వస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బిజెపి ప్రభుత్వం మార్చే స్తుందని డాక్టర్ శైలజానాథ్ విమర్శించారు. రాష్ట్ర విభజన హామీలను గురించి ప్రధాని మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. అయితే సభలో ప్రధానిమోదీ తెలుగు మాట్లాడిన మాటలకే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చప్పట్లు కొట్టారని రాష్ట్ర విభజన హామీలను గురించి ఏం మాట్లాడకపోయినా స్పందించ లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులపై కేంద్రాన్ని అడిగే నోరు ఇక్కడ లేదా..? ఎందుకోసం బిజెపితో టిడిపి, జనసేనలు పొత్తులు పెట్టుకున్నాయని డాక్టర్ శైలజానాథ్ ప్రశ్నించారు. ఎన్డీయే కూటమి పేదలకు వ్యతిరేకమని రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని ఆయన వెల్లడించారు.

# మూడు పార్టీలకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం

**- అభివృద్ధి, సంక్షేమం వైసీపీతోనే సాధ్యం - అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి**



సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత

**అనంతపురం సిటీ, మార్చి 18 ప్రభాతవార్త**

గతంలో ఐదేళ్లపాటు అధికారాన్ని అనుభవించి ప్రజలను వంచించి మరోమారు ఓట్ల కోసం జత కట్టిన బిజెపి, టిడిపి, జనసేన పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 20వ డివిజన్‌లో ఇంటింటికీ వైకాపా కార్యక్రమంలో జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే వైసీపీ పాలనలో జరిగిన అభివృద్దిని వివరించే బ్రౌచర్లను పంపిణీ చేస్తూ మరోమారు వైసీపీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. బిజెపి, టిడిపి, జనసేనలు ఉమ్మడిగానిర్వహించిన ప్రజా గళం సభలో ఆయా పార్టీల గళం పూర్తిగా మూగబోయిందన్నారు. రాష్ట్రానికి ఏం చేయబోతున్నారో నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఒకరికొకరు పొంతన లేకుండా సభలో మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలతా గమనిస్తున్నారన్నారు. గతంలో మూడు పార్టీలు కలిపి 2024 ఎన్నికల్లో తిరుపతి సభ వేదికగా ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేకపోయారో నిన్నటి సమావేశంలో చెప్పలేక పోయారన్నారు. అంతేకాకుండా గతంలో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శలపై కూడా చంద్రబాబు ఎందుకు చేయాల్సి వచ్చిందో సభలో చెప్పి ఉంటే బ ఆగుండేదన్నారు. అదే విధంగా పోలవరంను చంద్రబాబు ఏటీఎంగా వాడుకున్నారని గతంలో విమర్శించిన మోదీ అదే మాటకు కుట్టుబడి ఉన్నారా అన్నది స్పష్టం చేయాల్సి ఉందన్నారు. అయితే నరేంద్రమోదీ వైకాపా, కాంగ్రెస్ పార్టీలను ఒకే కుటుంబీకులు నడుపుతున్నారని చేసిన వ్యాఖ్యలు హాస్యా స్పదంగా ఉందన్నారు. టిడిపి అధ్యక్షులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఒకే కుటుంబీకులు కాదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్ని పార్టీలు ఏకమైనా రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా వైసీపీ వెంటనే నడుస్తారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పోరేటర్ లావణ్య, పలువురు ప్రజా ప్రతినిదులు, నేతలు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా బసవేశ్వర ఉత్సవం

**- చంద్రమౌళీశ్వరునికి కొనసాగిన ప్రత్యేక పూజలు - సాంప్రదాయ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు**



చంద్రమౌళీశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహంకు పూజల్లో పాల్గొన్న ఉత్తరాధికారి, కళ్యాణిస్వామి, సహాయ కమీషనర్ తదితరులు



బసవేశ్వర వాహనంపై కొలువైన చంద్ర మౌళీశ్వరుడు



ఉత్సవం ముందు సాంప్రదాయ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త**

గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం పాల్గుణ శుద్ధ నవమి సోమవారం రాత్రి ప్రాధాన్యతగల బసవేశ్వర ఉత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ఉదయం మహా గణారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరుగగా మఠం పీఠాధిపతుల సమాధులకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రాధాన్యత గల బసవేశ్వర ఉత్సవాన్ని తిలకించడానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. సంప్రదాయం ప్రకారం చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి బసవేశ్వర వాహనంలో ప్రతిష్టించి ఉత్సవాన్ని నిర్వహించారు. గజలక్ష్మి ముందు నడుస్తుండగా ఉత్సవం కొనసాగింది. ఈ ఉత్సవంలో పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహాస్వామి ఆధ్వర్యంలో ఉత్తరాధికారి కరిబసవరాజేంద్ర మహాస్వామి, ఆదోని చౌకీ మఠం కళ్యాణిస్వామి, సిద్ధగంగ మఠ శాఖామఠం అరుడూరు మఠం చెన్నబసవస్వామి, సహాయ కమీషనర్ కె.చిట్టెమ్మ, ఏజెంటు పి.రాజన్నగౌడ్, వీరశైవ సంక్షేమ సంఘం ప్రతినిధి పాల్తూరు శంకర్, బి.పి.వీరప్ప, వేద పండితుడు ఓ.కె.పవన్‌స్వామి, గవిమఠం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలిరాగా గవిమఠం ఆవరణం కిక్కిరిసింది.

# టిడిపి ఎంపి టికెట్లు దక్కేదెవ్వరికి..!

**- వీడని సస్పెన్స్**

**- టికెట్ల ఖరారుతో ప్రచారంలో వైసీపీ ఎంపి అభ్యర్థులు**



బికె.పార్థసారధి | గుండుమల తిప్పేస్వామి | అంబికా లక్ష్మినారాయణ | పరిపూర్ణానంద స్వామి

**అనంతపురం, మార్చి 18 ప్రభాతవార్త బ్యూరో**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనంతపురం, హిందూపురం లోక్ సభ స్థానాలకు తెలుగుదేశం తరుపున అభ్యర్థులు ఎవరు అన్నది ఇప్పటికీ సస్పెన్స్ వీడటం లేదు. హిందూపురం లోక్ సభ స్థానం పొత్తులో భాగంగా బిజెపికి ఇస్తారా, లేక తెలుగుదేశం పార్టీని బరిలోకి దిగుతుందా అన్నది తెలియరావడం లేదు. హిందూపురం పార్లమెంట్ స్థానానికి టిడిపి తరుపున పోటీ ఎక్కువగా ఉంది. ఆ స్థానం కోసం పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారధి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి నాయకులు అంబికా లక్ష్మినారాయణ, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్పలు ఆశీస్తున్నారు. బికె.పార్థసారధి పేరు ఇటు హిందూపురం, అటు లోక్ సభ స్థానానికి పార్టీ అధిష్టాన వర్గం పరిశీలిస్తోంది. హిందూపురం లోక్ సభ స్థానాన్ని పొత్తులో భాగంగా బిజెపికి కేటాయిస్తే పరిపూర్ణానంద స్వామి లేదా సత్యకుమార్ బరిలో దిగే అవకాశం కనిపిస్తోంది. అయితే హిందూపురం స్థానాన్ని బిజెపి కేటాయించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, బిజెపికి హిందూపురం లోక్ సభ స్థానం ఇవ్వకుండా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అడ్డుకుంటున్నట్లు ఆ మేరకు పార్టీ అధిష్టాన వర్గంపై ఒత్తిడి తెస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. హిందూపురం లోక్ సభ స్థానాన్ని బిజెపికి ఇవ్వకపోతే తెలుగుదేశం తరుపున బికె.పార్థసారధి లేదా, గుండుమల తిప్పేస్వామి, బరిలో దిగే అవకాశం ఉందని టిడిపి వర్గాల బోగట్ట. అనంతపురం లోక్ సభ స్థానానికి పెనుకొండ ఎమ్మెల్యే బికె.పార్థసారధితోపాటు టిడిపి నాయకుడు అంబికా లక్ష్మినారాయణ పేరు వినిపిస్తోంది. వైఎస్ఆర్ సిపి ఇప్పటికే హిందూపురం లోక్ సభకు బోయ సామాజిక వర్గానికి చెందిన శాంతమ్మను, అనంతపురం లోక్ సభ స్థానానికి కురుబ సామాజిక వర్గానికి చెందిన మాలగుండ్ల శంకర్‌నారాయణ పేర్లను ఖరారు చేసి అధికారికంగా కూడా ప్రకటించాయి. ఈ పరిస్థితుల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరపున ఎవరిని బరిలో దించుతారన్నది హాట్ టాపిక్‌గా ఉంది.

# బూత్ కమిటీ సభ్యులు సైనికుల్లా పని చేయండి

**- నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశంలో మంత్రి ఉషాశ్రీ చరణ్**



మాట్లాడుతున్న మంత్రి



హాజరైన బూత్ కమిటీ సభ్యులు

**పెనుకొండ, మార్చి 18 ప్రభాతవార్త**

గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క బూత్ కమిటీ సభ్యులు సైనికుల్లా పనిచేయండి అని మంత్రి ఉషాశ్రీ అన్నారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బూత్ కన్వీనర్లతో సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వృద్దులు ఓటు హక్కును వారి ఇంటి వద్దనే వినియోగించుకుని అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క బూత్ కన్వీనర్, కమిటీ సభ్యులు జగన్ సైనికులుగా పనిచేస్తూ మళ్లీ జగన్‌ను సీఎం చేసుకొనుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు.

# బడుగుల రాజ్యం బాబుతోనే సాధ్యం

**- వైకాపా వస్తే గ్రామాల్లో అరాచకాలు - తెదేపా గెలుపుకోసం ఇంటింటికి ప్రచారం ప్రారంభం**



టీడీపీకి ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్న పల్లె

**నల్లమాడ మార్చి 18 ప్రభాతవార్త,**

రాష్ట్రంలో బడుగుల చేతికి రాజ్యాధికారం దక్కాలంటే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని ఆదరించాలని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని బాపనకుంట, రామాపురం, నేరాలవంకతాండ, రెడ్డికుంటతాండా గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో పల్లెరఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని, టీడీపీ అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా కుల, మత వర్గ విభేదాలు లేకుండ రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు దరిచేరేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాజకీయ, ఆర్థిక, విద్య, సంక్షేమరంగాల్లో సామాజికన్యాయం అనుసరిస్తున్న ఏకైకపార్టీ తెలుగుదేశంపార్టీ పేర్కొన్నారు. అవినీతి చక్రవర్తిగా పేరుగాంచిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమం త్రిని చేస్తే రా ష్ట్రంలో అవినీతి పాలనకు ఆజ్యంపోసినట్లు అవుతుందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు అభివృద్ధి చేసిన ఫలాలను దోచుకొని జగన్‌మోహన్‌రెడ్డి అక్రమ మార్గంలో మరొకసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నాడని, అధికారంలోకి వస్తే ఆస్తులన్నీ కారుచౌకకే అమ్మేస్తాడన్నారు. దౌర్జన్యం, అహంకారాలతో విర్రవీగుతున్న వైకాపా పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు జరగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ప్రజాఅవసరాలు తీర్చే, అభివృద్ధికాంక్షించే టీడీపీ అభ్యర్థికి ఓటువేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలకన్వీనర్ మైలేశివశంకర, మాజీ ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, కేశవరెడ్డి, చంద్రారెడ్డి, రమణారెడ్డి, మైలేరామచంద్ర, సలాంఖాన్, బుటి ట్టనాగభూషణంనాయుడు, పాపారాయుడు, ప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, బాబావలి, చాందు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న డిఎస్‌పి

**పెనుకొండ, మార్చి 18 ప్రభాతవార్త**

వేసవి తాపానికి ప్రజల దాహార్తి తీర్చేందుకు బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో చలివేంద్రం ప్రారంభించారు. పెనుకొండ డిఎస్పీ బాబా జన్ సైదులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని చలివేంద్రం ప్రారంభించారు. మండల కేంద్రానికి వచ్చే చుట్టుపక్కల గ్రామ ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకున్న బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు హై కోర్టు న్యాయవాది శివరామకృష్ణ తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, చైతన్య వేదిక గౌరవ అధ్యక్షులు వెంకటేషులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, బాబు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## తాండా వాసులు నీటి కోసం తల్లడిల్లుతున్నారు

**అగళి, మార్చి 18 ప్రభాతవార్త**



నీటి కోసం పాట్లు పడుతున్న దృశ్యం

మండల పరిధిలోని ఉల్లెకెర తాండా వాసులు గత 15రోజులుగా నీటి కోసం తల్లడిల్లుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం మహిళలు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారని, కిలోమీటర్ కొద్ది వెళ్లి నీటిని మోస్తున్నామని తెలిపారు. సంబంధిత సర్పంచుకు, ఆర్‌డబ్లూ ఎస్ ఇంజినీర్‌కు, కార్యదర్శికి, ఎంపిడిఓకు విషయం తెలిపినా తాత్కాలికంగా మరమ్మత్తు చేసినట్లు చెబుతున్నారు కానీ తమకు నీరు మాత్రం రావడం లేదని, నీటి కోసం పాట్లు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న బావుల్లో నీటి మట్టం పడిపోయిందని, అదనంగా పైపులు దింపి నీటి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. ఈ విషయమై సర్పంచు రామకృష్ణప్ప, కార్యదర్శి ఫణిరాజ్‌ను వివరణ కోరగా పగిలిన పైపును కొద్ది వరకు మరమ్మత్తు చేయించామని, కానీ బోరులో నీటి మట్టం పడిపోయిందని, సదరు బోరులోకి అదనంగా పైపులు దింపి నీటి సమస్యను పరిష్కరించాల్సి ఉందని తెలిపారు.

## 11 కెవీ విద్యుత్ వైర్‌ను తొలగించండి

**అమరాపురం,మార్చి 18,ప్రభాతవార్త**



ఏఈకి వినతి దృశ్యం

మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ యందు నివాసం ఉన్న దాదాపు 14 కుటుంబాలకు చెందిన ఇండ్లపై 11 కెవీ కలిగిన విద్యుత్ వైర్ ఇండ్ల మధ్యపై వెల్లిందని బాదిత కుటుంబాల వారు అమరాపురం ఏఈ సిద్ధేశ్వర్‌కు వినతి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము మిద్దెపైకి ఎక్కితే చేతులకు విద్యుత్ తీగలు తగిలి ప్రమాధపు స్థితిలో ఉన్నామని వారు ఏఈ వద్ద వాపోయారు. ముఖ్యంగా అభం శుభం తెలియని చిన్నారులు మిద్దేపైకి ఎక్కితే 11 కెవీ ద్వారా ప్రమాధం అంచుల్లో ఉన్నమని బాధితులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకోని మా ఇండ్లపై వెల్లిన 11 కెవీ విద్యుత్ లైన్లను తక్షణం మార్చి మాకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు జయన్న,దత్తు, రాజన్న, ఇంతియాజ్,జాకీర్,బీర లింగప్ప,దాదు,శ్రీరాములు తదితరులు ఏఈ సిద్ధేశ్వర్‌కు వినతి అందజేశారు. ఏఈ మాట్లాడుతూ మీ వినతిని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

## ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు

**అమరాపురం,మార్చి 18,ప్రభాతవార్త**



పరీక్ష కేంద్రాల వద్ద పరిశీలిస్తున్న ఎస్‌ఐ

మండలంలోని అమరాపురం జూనియర్ కళాశాల, ఆధర్శ పాఠశాల,అంబెద్కర్ బాలికల గురుకుల పాఠశాల యందు 10వ తరగతి పరీక్షలు సజావుగా ప్రారంభమైనవి ఈ సందర్బంగా మండల వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలో గురుకుల,కేజీబీవి ఆధర్శ పాఠశాల మరియు ప్రైవేట్ పాఠశాలల నుండి విచ్చేసిన దాదాపు 625 మందికి గాను 10 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయా కేంద్రాల అధికారులు తెలిపారు. బాలిక గురుకుల పాఠశాల యందు చీఫ్ సూపరడెంట్ నరేంద్ర,డిఈఓ నాగరాజు మాట్లాడుతూ 193 మందికి గాను 191 మంది హాజరైనట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్బంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎస్‌ఐ జనార్ధన నాయుడు, ఏఎస్‌ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## విద్యార్థులకు సిఈటి ఉచిత కోచింగ్

**పావగడ, మార్చి 18 ప్రభాతవార్త**



గాయత్రి బాయి

పావగడ తాలూకాలోని విజ్ఞాన శాస్త్ర విద్యార్థులకు తేజస్ చారిటబుల్, ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ద్వితీయ పియుసి విద్యార్థులకు సిఈటి ఉచిత కచింగ్ ఇవ్వనున్నట్లు తేజస్ చారిటబుల్, ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి గాయత్రి బాయి శంకర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఈ కార్యక్రమానికి తాలూకాలోని ద్వితీయ విజ్ఞాన శాస్త్ర విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

**అమడగూరు, మార్చి 18 ప్రభాతవార్త**

మండలంలోని కర్ణాటక సరిహద్దులో వున్న చెక్‌పోస్టు వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న మర్రిమేకల నారాయణ అనే వ్యక్తిని అదుపులోకి అతని వద్ద నుండి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సి.టి మక్బుల్‌బాష తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి ఉత్తర్వుల మేరకు నల్లమాడ సిఐ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి మండలంలోని లోకోజుపల్లి గ్రామానికి చెందిన మర్రిమేకల నారాయణ కర్ణాటక నుండి అక్రమంగా మద్యాన్ని ఆంధ్రాకు తరలిస్తుండగా అతన్ని అరెస్ట్ అతని వద్ద నుండి 90 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది జబీవుల్లా, పి.భార్గవ పాల్గొన్నారు.

## 10వతరగతి పరీక్షలకు 60 మంది గైర్హాజరు

**లేపాక్షి, మార్చి 18 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన లేపాక్షిలో నిర్వహించిన 10వ తరగతి పరీక్షల్లో మొదటి రోజు 60 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఓ నాగరాజు తెలిపారు. ఏపిఆర్ఎస్ ఎ సెంటర్‌లో 15 మంది, ఏపిఆర్ఎస్ బి సెంటర్‌లో 19 మంది, ఎస్ఎస్ఆర్ఓ ఉన్నత పాఠశాలలో 15 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షలను ఎంఇఓలు నాగరాజు, కుళ్లాయప్పలను పర్యవేక్షించారు.

## ఎన్నికల విధి నిర్వహణ పట్ల అప్రమత్తంగా మెలగాలి

- ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి



ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, మార్చి 18 ప్రభాతవార్త**

జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బిఎల్ఓలు తమ విధులు పట్ల అప్రమత్తంగా వుండాలని నియోజకవర్గం సహాయ ఎన్నికల అధికారి, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల పట్ల ఎలాంటి అభ్యంతరాలు వచ్చినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలియచేశారు. ఈ సమావేశంలో తహశీల్దార్ భారతి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## మూడు చోరీలు..మరో మూడు చోట్ల యత్నం

**గుత్తి, మార్చి 18 ప్రభాతవార్త**



గుత్తిలో చోరీ జరిగిన దృశ్యం

పట్టణంలో సోమవారం తెల్లవారు జామున మూడు చోట్ల చోరీ జరగగా మరో మూడు చోట్ల చోరికి యత్నం జరిగింది. తాడిపత్రిరోడ్డులోని బాషాకు చెందిన ఫోటో స్టూడియో, అశోక్‌కు చెందిన డిజిటల్ షాపులో చోరీ జరగగా ఒక ట్యాబ్, కొంతమేర నగదు చోరీ జరిగింది. ఆర్ఎస్ రోడ్డులోని న్యాయవాది ఇస్మాయిల్ కార్యాలయంలో 2 వేల రూపాయలు చోరీకి గురైంది. అదేవిధంగా గుత్తి ఫైనాన్స్, ఎలక్ట్రికల్ దుకాణం, జ్యువెలరీ షాపుల్లో దొంగతనానికి అగంతకులు విఫలయత్నం చేశారు. వరుస చోరీలు జరుగుతున్నప్పటికి పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం, రికవరీలు చేయకపోవడం పట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సంఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

## సజావుగా 10వ తరగతి పరీక్షలు



పరీక్షా కేంద్రాల వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

**గుత్తి, మార్చి 18 ప్రభాతవార్త**

గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం 10వతరగతి పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని 2095 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇఓ రవినాయక్ తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకై 94 మంది ఇన్విజిలేటర్లు, 14 మంది సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు సిఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ నబీరసూల్ పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. కాగా మండువేసవి దృష్ట్యా విద్యార్థుల సౌకర్యార్థం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## గర్భవతులకు పోష్టికాహారం కిట్ల పంపిణీ

**గుత్తి, మార్చి 18 ప్రభాతవార్త**



గర్భవతులకు కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

పట్టణంలోని జంగాల కాలనీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 50 మంది గర్భవతులకు బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఐరన్ సిరప్‌లు, విటమిన్స్‌తో కూడిన పౌడర్ కిట్లను పంపిణీ చేశారు. పిహెచ్‌సిలో పనిచేసే రామకృష్ణ తన తల్లి సరస్వతి జ్ఞాపకార్థం 10 వేల రూపాయల విలువచేసే కిట్లను గర్భవతులకు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గర్భవతులకు పలు సూచనలు ఇచ్చారు. కాలనీవాసులు వ్యాపార నిమిత్తం దూర ప్రాంతాలకు వెళతారని అందువల్ల ప్రభుత్వాసుపత్రిలో నాలుగుమార్లు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. వారికి ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా స్కానింగ్ చేయించుకునేందుకు తగిన ధృవీకరణపత్రాలను అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రెడ్డమ్మ, రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, శివప్రసాద్, ఎఎన్ఎంలు సునీత, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం-అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



తలారి రంగయ్య ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, మార్చి18 ప్రభాతవార్త ప్రతినిధి**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కళ్యాణదుర్గం అభ్యర్థి తలారి రంగయ్య సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ తిరుగుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను గమనించాలని, అలాగే చేసిన అభివృద్ధిని గుర్తించాలని, ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోస పోవద్దని విలువైన ఓటును ప్రజలకు మంచి చేసిన జగనన్న ప్రభుత్వం ఫ్యాను గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందించిన సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాల వివరాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొబ్బరి బోండాల బండి వద్ద సరదాగా కొబ్బదిబోండాం కొట్టి పాదచారులను అకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవతరగతి పరిక్షలు

**బ్రహ్మసముద్రం మార్చి 18 ప్రభాతవార్త,**

మండల కేంద్రంలో జిల్లాపరిషత్ పాఠశాలలో సోమవారం పదవతరగతి పరిక్షలకు 367 మంది విధ్యార్థులు హాజరుకావాల్సి వుండగా అందులో 6మంది విధ్యార్థులు గైర్హాజరు అయ్యారు ఇందులో 361 మంది విధ్యార్థులు హాజరైనట్టు ఎంఈఓ ఒబుళపతి తెలిపారు. పదవతరగతి పరిక్షలు జరుగుతున్న సందర్భంగా యస్ఐ పరశురాముడు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

## పదోతరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కొత్తచెరువు మార్చి 18 ప్రభాతవార్త**



చిన్నపల్లి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

సత్యసాయి జిల్లాలో వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎనుముల పల్లిలోని వాసవి,చిన్నపల్లి జడ్పిహెచ్ఎస్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి నల్లమాడ, బుక్కపట్నం,జడ్పిహెచ్ఎస్ లోని పరిక్షాకేంద్రాలను తనిఖీ చేశారు.సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రెండు డివిజన్‌లోని 115 కేంద్రాలలో 23816 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా వారిలో 22862 మంది హజరయ్యారు.పెనుకొండ డివిజన్‌లోని 63 కేంద్రాలో 12663 మంది రాయాల్సి ఉండగా 12126 మంది మాత్రమే హజరయ్యారు. అలాగే ధర్మవరం డివిజన్‌లోని 52 కేంద్రాలలో11153 మంది రాయాల్సి ఉండగా వారిలో 10734 మాత్రమే హాజరయ్యారు.419 మంది గైహజరయ్యారు. మొదటిరోజు పరీక్షకు మొత్తం 954 మంది విద్యార్థులు గైహజరయ్యారు. మొత్త హజరైన విద్యార్థుల శాతం 95.99 గా నమోదయింది.జిల్లాలో మొదటి రోజు పరీక్ష ప్రశాంతగా జరిగిందని డిఈఓ తెలిపారు.

## సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడండి

**ధర్మవరం రూరల్, మార్చి 18ప్రభాతవార్త**



మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్

సకాలంలో మున్సిపాలిటీ పన్నులు చెల్లించి పురపాలక అభివృద్ధికి పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్నులో రూ.8,94,892,254కు గాను, 4,43,28,766. వసూలు కావడం జరిగిందని, ఇంకా 4,51,60,488 వసూలు కావాల్సి ఉందన్నారు. అదే విధంగా నీటి పన్నుల్లో రూ.8,43,36,977కుగాను 3,40,71,090 వసూలు కావడం జరిగిందని ఇంకా 5,02,65,887 వసూలు కావాల్సి ఉందన్నారు. ఖాళీ జాగా పన్నుల్లో రూ.65,70,653కు గాను 18,42,509 వసూలు అయిందని, ఇంకా 47,28,144 రూపాయలు పన్ను వసూలు కావాల్సి ఉందన్నారు. పట్టణ ప్రజలు వ్యాపారస్తులు అందరూ కూడా మొండి బకాయిలు కూడా మార్చి 31వ తేదిలోపు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

## విద్యుత్ షాక్‌తో దొంగ మృతి

**బత్తలపల్లి, మార్చి 18 ప్రభాతవార్త**



ట్రాన్స్‌ఫార్మర్‌పై వేలాడుతున్న గుర్తుతెలియని వ్యక్తి

చీని తోటకు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్ నుండి కాపర్ వైరు దొంగలించేందుకు స్థంభం పైకి ఎక్కిన గుర్తుతెలియని దొంగ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. బత్తలపల్లి పోలీసులు, ట్రాన్స్‌కో సిబ్బంది తెలిపిన వివరాల మేరకు బత్తలపల్లి, నార్సింపల్లి గ్రామాల మధ్యన రైతు తొలిచూరి వెంకటేషు అనే రైతు చెందిన చీని తోట వుంది.ఆ తోటకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతు ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి కాపర్‌వైరును దొంగలించేం దుకు విద్యుత్‌స్థంభం పైకి ఎక్కగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం సాయంత్రం తోట యజమాని తోటలోకి వెళ్లి చూడగా స్థంభంపైనే మృతిచెంది వేలాడుతున్న వ్యక్తి కనిపించంతో బత్తలపల్లి ఎస్ఐకు, ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏఈ శివయ్యలు తమ సిబ్బందితో మృతదేహన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాగి, ఆయిల్ కోసం వచ్చిన వ్యక్తికి విద్యుత్ షాక్ తగలడం వలన కాళ్లు, చేతులు, ముఖంపై తీవ్రగాయాలైయ్యాయి. మృతుని వివరాలు తెలిసిన వారు బత్తలపల్లి ఎస్ఐను 9440796833అనే నెంబరులో సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

## పార్థివదేహనికి నివాళి అర్పించిన సామకోటి

**పుట్టపర్తి రూరల్ మార్చి 18 ప్రభాతవార్త**



పార్థివదేహనికి నివాళి అర్పిస్తున్న సామకోటి

సత్యసాయి జిల్లా కేంద్రంలోని పుట్టపర్తి పెద్దబజార్‌కు చెందిన చాకలి వెంకటేష్ సోమవారం ఆకస్మాత్తుగా మృతి చెందడం జరింగింది. ఈ విషయం తెలుసుకున్న టిపిడి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని అశ్రునివాలిని అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి,వారికుటుంబాన్ని అన్ని విధాల అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి,నాయకులు పాల్గొన్నారు.

## పరీక్షాకేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

**పుట్టపర్తి రూరల్ మార్చి18 ప్రభాతవార్త**

జిల్లా ఎస్పి మాధవరెడ్డి ఆదేశాలతొ పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షాకేంద్రాల వద్ద జిల్లా ఎస్పి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షాకేంద్రాలలోకి విద్యార్థులు ఎలాంటి సెల్‌ఫోన్లు,స్మాట్‌వాచ్‌లు,పర్సులు,ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పోలీసు బృందాలచే పరీక్షా కేంద్రాలవద్ద పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించారు. పరీక్షాకేంద్రాల సమీప ప్రాంతాలలో పరీక్షలు ముగిసేంత వరకు జిలాక్స్/ప్రింటింగ్ సెంటర్లు మూసివేయించిన పోలీసులు,పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా,సాఫీగా జరగడానికి పోలీస్ శాఖ తరుపున అన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ రోజు నుండి ఈ నెల 30 వరకు జరగనున్న పదవతరగతి పరీక్షలు,జిల్లా వ్యాప్తంగా 115 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా యంత్రాంగం తెలియజేసింది

## సజావుగా 10వ తరగతి పరీక్షలు

**బెలుగుప్ప, మార్చి 18 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో 10వ తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు ఈ సందర్భంగా మండల విద్యాధికారి మల్లారెడ్డి మాట్లాడుతూ. మండలంలో 537 మందికిగాను 479 మంది హాజరయ్యారు. మిగతా 58 మంది హాజరు కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

## జిల్లాకోర్టు ఏర్పాటుకు హైకోర్టు సానుకూలం

**-ప్రాదేశిక పరిధితో ప్రతిపాదనలు పంపాలని పుట్టపర్తి బార్‌కు సూచన**

**పుట్టపర్తి టౌన్ మార్చి 18 ప్రభాతవార్త**



జిల్లా జడ్జి శ్రీనివాస్ కు ప్రతిపాదనలతో కూడిన లేఖను అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి జిల్లాకోర్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు హైకోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ ఏడాది జనవరి 26న ప్రశాంతినిలయానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జిల్లా పోర్ట్ పోలియో జడ్జి అయిన మన్మధరావుకు నూతనంగా ఏర్పడిన సత్యసాయి జిల్లాలో కోర్టు తో పాటు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని వినతించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పుట్టపర్తి బార్ అభ్యర్థనను మన్నించిన హైకోర్టు జడ్జి సానుకూలంగా స్పందించారు. టేరిటోరియల్ జ్యురిసిడిక్షన్(ప్రాదేశిక పరిధితో కూడిన)ప్రతి పాదనలు పంపాలని హైకోర్టు లేఖ ఆర్ఓసి నంబర్ 54ఇన్/2024తేదీ20/02/2024మేరకు పుట్టపర్తి బార్ వినతి పత్రాన్ని జతపరుస్తూ జిల్లాకోర్టు తో పాటు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు విస్తృత పరచడానికి అవసరమైన సమగ్ర ప్రతిపాదను పంపాలని జిల్లా జడ్జిను సదరు లేఖ ద్వారా ఆదేశించారు. దీంతో జిల్లా జడ్జి సదరు లేఖను ఉటంకిస్తూ పుట్టపర్తి బార్ నుండి(టేరిటోరియల్ జ్యురిసిడిక్షన్) ఏర్పాటుకు ప్రాదేశిక పిరిధితో కూడిన మండలాలను వివరాలు క్రిమినల్,సివిల్ కేసుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను అందజేయాలని కోరడం జరిగింది. దీంతో సోమ వారం పుట్టపర్తి బార్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి,సభ్యులు యదుభూషన్, కృష్ణప్రసాద్ తో కూడిన బృందం జిల్లా జడ్జి శ్రీనివాస్‌ను కలిసి ప్రతిసాదనలతో కూడిన లేఖను అందజేయడం జరిగింది. ప్రధానంగా సీనియర్ సివిల్ జడ్జిపరిధిలో ఉన్న పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం తో పాటు గోరంట్ల,నల్లమాడ,ఓబుళదేవురచెరువు, అమడగూరు మండలాలను కలుపుతూ ప్రాదేశిక పరిధితో కూడిన సినియర్ సివిల్ డివిజన్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు జిల్లా జడ్జి దృష్టికి ప్రతిపాదనలతో నివేదించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి బార్ సభ్యులతో పుట్టపర్తిలో కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు హైకోర్టు సానుకూలంగా ఉందని ఇందుకోసం డిటైల్డ్ రిపోర్టును పంపాలని ఆదేశించి ఉన్నారని వివరించారు. జిల్లాకోర్గు కాంప్లెక్స్ ఏర్పాటుకు పది ఎకరాలు కేటాయించాలని జిల్లా కలెక్టర్ కు లేఖను కూడా పంపామన్నారు. ఐతే కలెక్టర్ కార్యలయం నుండి స్పందన కనపరచడంలో జాప్యం నెలకొంటుందని తెలిపారు. పుట్టపర్తి కోర్టు వనరులను సౌలభ్యలను మెరుగు పరిచామని తగినంత సిబ్బందిని నియమించమన్నారు. కోర్టు పనితీరును బార్ సభ్యులతో జడ్జి అడిగి తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు సాకారం అవుతుందని జడ్జి తన సమ్మతిని వ్యక్త పరిచారు.

## చంద్రబాబును కలిసిన వడ్డెర్ల సంఘం నాయకులు



చంద్రబాబుతో సమావేశమైన వడ్డేర నాయకులు

**పుట్టపర్తి రూరల్ మార్చి 18 ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రిని చంద్రబాబును పుట్టపర్తి నియోజకవర్గ వడ్డెర సంఘం ముఖ్యనాయకులు సోమవారం అమరావతిలోని ఉండవల్లి లోని చంబ్రాబు నివాసంలో కలిసారు. ఈ సమావేశంలో వడ్డెర నాయకులతో పాటు పోలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్,బిసిసెల్ రాష్ట్ర అధ్యక్షులు మాజీమంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో వడ్డెర్లకు చట్టసభల్లో ఎంపి,ఎమ్మెల్యేలుగా అవకాశం కల్పిస్తానని ఎస్టీ జాబితాలో చేరుస్తానని హామీఇచ్చారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నకలలో మొదటి,రెండవ విడతల్లో 14 వ తేదీన ప్రకటించిన జాబితాలొ వడ్డెర్ల పేర్లు లేకపొవటంతో పుట్టపర్తి వడ్డెర నాయకలు చంద్రబాబు నాయుడు నివాసం వద్ద ఆందోనలు చేశారు. 17న ప్రధాని పర్యటన ఉన్నందున,18న సమావేశమైనట్లు తెలిపారు. ఆ హామీ ప్రకారం వడ్డెర ముఖ్యనేతలతో సమావేశమై హిందూపురం పార్లమెంటు తో పాటు రెండు అసెంబ్లి స్థానాలలో వడ్డెర్ల గురించి సర్వే చేయించి వడ్డెర అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మల్లెల జయరాం, జాతీయ ఉపాధ్యక్షుడు పుల్లపు జయచంద్రమోహన్, దలవాయి వెంకటనారాయణ,జరిపిటి కృష్ణమూర్తి,వెంకట్, సిమెంట్ పొల్లన్న,తన్నూరి ఆంజనేయులు,రమాదేవి,నాగార్జున,మల్లెల ఈశ్వర్, తరుపాల బాబు,తురక వీరస్వామి,మారెప్ప,మన్నూరప్ప,ఉత్తన్న పాల్గొన్నారు.

## హోర్డింగ్‌లు, పోస్టులు తొలగించండి



ఆర్‌డిఓకు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**ధర్మవరం టౌన్, మార్చి 18 ప్రభాతవార్త**

అధికారపార్టీకి చెందిన హోర్డింగ్‌లు, ఇళ్ళ గోడలకు, విద్యుత్ స్థంభాలకు అతికించిన స్టిక్కర్లు, పోస్టర్లు ఇంకా అలాగే ఉన్నాయని వెంటనే వాటిని తొలగించాలని బిజెపి నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. వాటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆర్‌డిఓ వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాంకుమార్‌లకు వేరువేరుగా వినతి పత్రాలను సమర్పించారు.న ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో అధికారులు వెనుకంజవేస్తున్నారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే వాటిపై చర్యలు తీసుకుని తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు డిష్‌రాజు, గొట్లూరు చంద్ర, నారాయణ స్వామి యాదవ్, సూర్యనారాయణరెడ్డి, గిరిధర్, రహీం, నబీరసూల్, నారాయణస్వామి, రాప్తాటిరాము,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అదిలాబాద్ వాసుల మహానగర సంకీర్తన




నగర సంకీర్తన నిర్వహిస్తున్న అదిలాబాద్ భక్తులు

**పుట్టపర్తి రూరల్ మార్చి18 ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి సన్నిధి పుట్టపర్తి పుర వీధులలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వాసుల మహానగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి పర్తియాత్ర పేరిట అదిలాబాద్ జిల్లా నుండి వేలాది మంది సాయిభక్తులు పుట్టపర్తికి విచ్చేశారు. రెండురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహసమాధిని దర్శించుకున్నారు. సోమవారం మహనగర సంకీర్తన నిర్వహించారు. స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద శ్రీసత్యసాయి రథానికి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ పూజలు నిర్వహించి ర్యాలీ ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు మేలవిస్తూ కోలాహలంగా నగరసంకీర్తన సాగింది. మహిళలు కలశాలు చేత పట్టుకొని,బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాదళ్ తెలంగాణ రాష్ట్రఅధ్యక్షుడు వెంకట్రావు, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా సేవాసమితి అధ్యక్షులు శ్రీనివాసరావు, జనార్ధన్, బీమ్‌సేన్,నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని నోటీసు
## - పంచాయతీరాజ్ చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు - ఈఓఆర్‌డి శశికళ

వార్త ప్రభావం

పామిడి, మార్చి 18 ప్రభాతవార్త
మండల పరిదిలోని జి.కొట్టాల గ్రామపంచాయతీ కాళాపురం పొలం నందు జాతీయరహదారి సమీపంలో పంచాయతీ ఆధాయానికి గండి కొడుతూ భారీగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఈఓఆర్‌డి శశికళ, కార్యదర్శి మునీంద్ర నిలిపివేయించారు. నిదురోతున్న పంచాయతీ వ్యవస్థ.. పంచాయతీ ఆధాయానికి గండి.. జి.కొట్టాల గ్రామ పంచాయతీ పరిదిలో భారీగా అక్రమ నిర్మాణాలు.. పంచాయతీరాజ్ చట్టాన్ని అతిక్రమించి అక్రమ నిరా ్మణా లు.. మామూళ్ళ మత్తులో జోగుతున్న అధికారులు అంటూ సోమవారం 'వార్త'లో కథనాన్ని ప్రచురించటంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి మునీంద్ర ఈఓఆర్‌డి శశికళ ఆదేశాల మేరకు అక్కడి ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులను పొందిన తరువాతనే నిర్మాణాలను చేపట్టాలని సంబందిత వ్యక్తులకు తెలియజేస్తూ అక్కడ నోటీసును అతికించారు. గ్రామపచాయతీలో ఎక్కడైనా నిర్మాణాలను చేపట్టాలంటే అనుమతులు తప్ప నిసరి అన్నారు. పంచాయతీరాజ్ చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఈఓఆర్‌డి శశికళ హెచ్చరించారు. గ్రామపం చాయతీ అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై 'వార్త' కథనాన్ని ప్రచురించగా స్పందించిన ఈఓ ఆర్‌డి శశికళ జి.కొట్టాల గ్రామప ంచాయతీ కార్యదర్శి మునీంద్ర సదరు వ్యక్తులకు నోటీసు అందజేసి నిర్మాణా లను నిలిపివేయించటంతో ప్రజలు 'వార్త'కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


అక్రమ నిర్మాణాలకు నో టీసును అతికిస్తున్న పం చాయతీ కార్యదర్శి మునీంద్ర

# బండారు శ్రావణిశ్రీకి శుభాకాంక్షలు తెలిపిన దండు

శింగనమల, మార్చి 18 ప్రభాతవార్త
తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీ నివాసులు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ.. మనమంతా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులం మనందరి మధ్య ఏ చిన్న సమస్య వచ్చినా కుటుంబం లాగా కలుసుకుని కష్ట పడి పని చేసి విజయాన్ని సాధించి నియోజకవర్గాన్ని కానుకగా మన అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకురావాలని, ఏ విషయాన్నైనా నా దృష్టికి తీసుకొస్తే ఆ సమస్యను మనందరం కూర్చుని మాట్లాడుకుందామని, అందరం కలిసి ఎన్నికలకు సిద్ధం అవుదామని, గ్రామంలో ప్రతి ఒక్కరినీ కలుపుకుని పని చేయా లన్నారు. అనంతరం దండు శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపి ంచడానికి తనవంతుగా కృషిచేస్తానని, చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకుందామని, మరోసారి శింగనమల సెంటిమెంట్‌ను నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అనంతపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుశురామ్, అనంతనేని చౌదరి, నాగేశ్వర్‌రెడ్డి, బెస్త నారాయణస్వామి, బెస్త అమర్, దేరంగుల శంకరయ ్య, మహ్మద్‌గౌస్, ప్రసాద్‌నాయక్, జంగంశెట్టి నవీన్, దండు ప్రకాష్, సూరి, సతీష్‌రాయల్, రాజాబాబు, కుమార్, నరసింహా నాయక్, పుల్లయ్య, గడ్డం నారాయణ, జడేజా, నల్లప్ప, రవి, దాసరి వెంకటరమణ, రంగస్వామి, విజయ్‌కుమార్, రమేష్‌రెడర్డి, సంజప్ప, మల్లేష్ పాల్గొన్నారు.


బండారు శ్రావణిశ్రీకి పూల బొకేను అందిస్తున్న దండు శ్రీనివాసులు

# పార్టీ పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం
## - పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు - సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి

శింగనమల, మార్చి 18 ప్రభాతవార్త
వైఎస్ఆర్‌సిపి కొరకు కష్ట పడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తింపు లభిస్తుందని సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రామస్వామి దేవాలయంలో ఇటీవల వైఎస్ఆర్ సిపి మండల కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చిట్రాల బాలకృష్ణ, మండల యూత్ కన్వీనర్ బెస్త ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజినేయులు, వైసీపీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి లలితా కళ్యాణి, వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ, జెసిఎస్ కన్వీనర్ వెంకటరమణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఓబుళపతి, ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీకి విదేయతే ప్రామాణికంగా సామాన్యులకు సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే టికెట్, ఎంపి టికెట్‌లు కేటాయించారని, వైఎస్ఆర్‌సిపి కోసం సుదీర్ఘ కాలంగా కార్యకర్తగా పని చేస్తున్న టిప్పర్ డ్రైవర్ ఎం.వీరాంజి నేయులు శింగనమల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించడాన్ని ఆయన గుర్తు చేశారు. ఒక సామాన్య మహిళ అయిన సిహెచ్ ప్రమీళ కు ఏపి రాష్ట్ర నాటక అకాడమి ఛైర్‌పర్స న్‌గా గుర్తించడం మనందరం గుర్తించాలని అహర్నిశలు పార్టీ కోసం పని చేసే వారిని ప్రోత్సహిస్తూ ప్రజా సేవలో మరో రెండు రెంట్లు వారిని పైకెక్కిస్తానన్న మాటను ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులును, ఎంపిగా శంకర్‌నారాయణను గెలిపించుకుందాం అన్నా రు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి

# ప్రజల ఆదరణతో నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేస్తాం..బండారు శ్రావణీశ్రీ

బుక్కరాయసముద్రం మార్చి 18 ప్రభాతవార్త
శింగనమల నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేస్తాం ప్రజలు ఇప్పటికే వైకాపా ప్రభుత్వంతో విసిగెత్తిపోయారు.ఎప్పుడు ఎన్నికలు వస్తాయాని ఎదురుచూస్తావున్నారు.ఓటు అనే ఆయుధంతో ప్రజలు తగిన బుద్ధిచెప్పడానికి సిద్దంగా ఉన్నారని టిడిపి,జనసేన,బిజెపి ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు.సోమవారం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని జంతులూరు, చెదుళ్ళ గ్రామంలో బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.వారితోపాటు ద్విసభ్యకమిటి సభ్యలు మంటిమడుగు కేశవరె డ్డి, ఆలం నరసానాయుడు,రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామలిం గారెడ్డి,జిల్లా పార్లమెంటరీ అదికార ప్రతినిది పర్వతనేని శ్రీదర్‌బాబు ముఖ్య నాయకులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగ వారు మాట్లడుతూ వైసీపీ పార్టీని ఓటు అనే ఆయుధంతో తుంగలో తొక్కండి చంద్రబాబు తోనే రాష్ట్ర భవిష్యత్తు, గ్రామంలో ఇంటింటికి సూపర్ సిక్స్ పథకాల గురించి బీసీ డిక్లరేషన్ గురించి కరపత్రలను పంపిణీచేశారు.వైసీపీ ప్రభుత్వ పాలనలో భద్రతలేదని ప్రశ్నించిన మహిళలపై దౌర్జన్యాలు, హత్యలు, ఎక్కడచూసిన అక్రమాలు, భూదందాలతో ప్రజలు విసిగెత్తిపోయారు.సైకిల్ గుర్తుకు ఓటువేసి చంద్రబాబు నాయుదును ముఖ్యమంత్రిని చేద్దాం మీ ఇంటి ఆడబిడ్డ శ్రావణీశ్రీని ఆదరి ంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనరు అశోక్‌కుమార్, టిడిపి నాయకు లు పసుపుల హనుమంతురెడ్డి, దండువారిపల్లి ఆది నారాయణ, అగ్రహారం రాము, జొన్న రామయ్య,రమేష్, ఎస్. నారాయణస్వామి, లక్ష్మి నారాయణ, రామానాయుడు, ఓబులపతి, జింకాశివా, బంగిరాము, నరేంద్ర యాదవ్, మారెన్నతోపాటు టిడిపి,జనసేన.బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న శ్రావణీశ్రీ

# బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోండి

అనంతపురం న్యూటౌన్, మార్చి 18 ప్రభాతవార్త
2019, 2020, 2021, 2022 సంవత్సరాల్లో నేషనల్ మీన్స్-కం -మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికైన ఈ ఏడాది 9, 10, 11, 12 తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు/రె న్యూవల్ చేసుకున్న ప్రతి విద్యార్థి తప్పకుండా తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ సీడింగ్ చేయించుకోవాలీని డిఇఒ బి.వరలక్ష్మి, ఏసి గోవింద నాయక్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. లేని పక్షంలో స్కాలర్ షిప్ జమ కాదన్నారు. విద్యార్థి తమ మెరిట్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ తీసుకుని సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆధార్ సీడ్ చేయమని అడిగి చేయించుకోవాలన్నారు. విద్యా మంత్రిత్వశాఖ, న్యూ ఢిల్లీ వారు నేరుగా విద్యార్థి ఆధార్‌కు సీడ్ అయిన బ్యాంక్ ఖాతాలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి )విధానంలో స్కాలర్‌షిప్ జమా చేస్తారన్నారు. అందువల్ల ఆధార్ సీడిం గ్ కాని విద్యార్థులకు స్కాలర్‌షిప్ జమకాదన్నారు. స్కాలర్‌సిప్ యొక్క స్టేటస్ విద్యార్థి లాగిన్‌లో మాత్రమే తెలుస్తుందని, కావున విద్యార్థి లాగిన్ తరచుగా తనిఖీ చేసుకోవాలన్నారు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

# కార్పోరేట్ విద్యా సంస్థల దోపిడి అరికట్టాలి
## - ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 18 ప్రభాతవార్త
అనంతపురం నగరంలో గణనాయక భవనంలో ఎస్‌ఎఫ్ఐ ముఖ్య నాయ కులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్పొరేటర్ విద్యా సంస్థలు దోపిడికి వ్యతిరేకం గా కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది. ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పోరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు దోపిడి ప్రారంబి స్తున్నారన్నారు. ఈ సమస్యలు జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ జిల్లా గర్ల్ ్స కన్వీనర్ రజిత జిల్లా అధ్యక్షులు శివ, ఉపాధ్యక్షులు వైటిసి రమేష్, సిద్దు, వంశీ, జిల్లా సహాయ కార్యదర్శిలు గిరి, వె ంకీ, చందు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

# నకిలీ బంగారు ముఠా అరెస్ట్
## - నకిలీ బంగారు నాణ్యాలు స్వాధీనం - సిఐ

కూడేరు, మార్చి 18 ప్రభాతవార్త
స్థానిక మండల పరిధిలోని పలు గ్రామాల్లో నకిలీ బంగారు నాణ్యాలు విక్రయాలు జరపడా నికి తీవ్ర ప్రయత్నా లు చేస్తున్నట్లు అందిన సమాచారాన్ని బట్టి పోలీసుల వెంటబడి నకిలీ బం గారు నాణ్యాలు ముఠాను కూడేరు పోలీసులు ఆదివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కర్నాటక రాష్ట్రం అనంతపురం సిటీకి చెందిన భాస్కర్, రాం ప్రసాద్, ధనుంజయ, తాతయ్య ముఠాగా ఏర్పడి ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఈ సందర్భంగా సిఐ శివరాముడు మాట్లా డుతూ.. హైదరాబాద్‌కు చెందిన నరసింహాచారి అనే అతనిపై నలుగురు వెళ్లిన తన పొలంలో బంగారు నాణేలు దొరికినాయి అని, వాటిని తక్కువ ధరకు ఇస్తామన్నట్లు నమ్మించి అతని నుంచి 11 లక్షల రూపాయలు తీసుకున్నారు. అవి నకిలీవని తెలిసి కూడేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగాకూడేరు పోలీస్ వారు పై ముద్దాయిల్లో ముగ్గురుని అరెస్ట్ చేయగా ఒకరు తప్పించుకుని పారిపోయారు. వారి నుంచి ఒక క ఆరు, రెండు చిన్న కత్తులు, 298 నకిలీ బంగారు నాణ్యాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు పంపించి కేసు నమోదు చేసినట్లు సిఐ శివరాముడు విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమ సిబ్బంది పాల్గొన్నట్లు తెలియజేశారు.


నకిలీ బంగారు నాణ్యాల ముఠాను అరెస్టు చేసిన దృశ్యం

# చిక్కేపల్లిలో పలువురు వైసిపిలోకి చేరిక


వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి

యాడికి, మార్చి 18 ప్రభాతవార్త
మండలంలోని చిక్కేపల్లి గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. రామ కృష్ణారెడ్డితో పాటు 30 మంది వైసిపాలో చేరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వారికి వైకాపా కండువా వేసి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్ర మంలో పేరం స్వర్ణలత, యాడి కి మండల వైసిపి సీనియర్ నాయకులు బాలరమేష్‌బాబు, మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి, ఉమ్మడి రామాంజ నేయరెడ్డి, జూటూరు భాస్కర్‌రెడ్డి, కోడూరు సుబ్బారెడ్డి, పిన్నేపల్లి లక్ష్మిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎర్ర కొండారెడ్డి, వెల్లబోయిన వెంకటేష్, సందీప్, నాగేంద్ర, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాడికిలో రాయలసీమ స్థాయి కబడ్డీ పోటీలు

యాడికి, మార్చి 18 ప్రభాతవార్త
మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 22 నుండి రాయలసీమ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు సోమవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్త రామిరెడ్డి, వైకాపా మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఉపసర్పంచు కాసా చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో ప్రథమ బహుమతి 20 వేల రూపాయలను దాత కోన లక్ష్మినారాయణరెడ్డి (తిరునాంపల్లి), నారాయణరెడ్డి (చిక్కేపల్లి), ద్వితీయ బహుమతిని వేములపాడు గ్రామానికి చెందిన మహమ్మద్‌బాష 15 వేలు, తృతీయ బహుమతి కడ్డీల నాగేంద్ర (యాడికి) 10 వేలు, నాల్గవ బహుమతి 5 వేలు కోటి వెంకటరాముడు (యాడికి) అందచేయనున్నారు. ఆసక్తిగల వారు రామమోహన్ 9912057077, అవుకు రాజు 9000176471కు సంప్రదించాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు.

# దళితులపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి

నార్పల రూరల్, మార్చి 18 ప్రభాతవార్త
దళితులపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు శింగనమల ఇన్‌చార్జ్ రంగాపురం పుల్లప్ప, ఏపి ఎంఆర్‌పిఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు మీనుగ రామాంజినేయులు సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం వరుస దాడులకు గురై ప్రభుత్వాసుపత్రిలో ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్న మండల ంలోని గూగూడు గ్రామానికి చెందిన దళితులు నల్లప్ప కుమారుడు రామాంజినేయులుపై భౌతిక దాడులు చేయడం సమంజసంకాదన్నారు. ఇలాంటి దాడులు మాను కోకపోతే తిరుగుబాటు చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. ఇప్పటికే చాలా రకాల దాడులు, దౌర్జన్యాల బారినపడి ఎంతో నష్టాలు చవిచూశామని సహనం ఎంత వరకు వుంటుందో గమనించు కోవాలన్నారు. నల్లప్ప, రామాంజినేయులుపై అతి కిరాతకంగా రాత్రి వేళల్లో కాపు కాచి చంపానులకోవడం దుర్మార్గమైన చర్యన్నారు. దళితుల మోటర్‌బైక్‌ను కూడా కాల్చివేశారన్నారు. దాడికి పాల్పడిన బోయ పూజారి రాజప్ప, నరసింహులుపై హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్‌సిలపై దాడులు జరుగుతున్నా ఇరు పార్టీల నాయకులు స్పంది ంచక పోవడం మరింత ఘోర మన్నారు. దళితులపై జరుగుతున్న దారుణాలపై నోరు విప్పని రాజకీయ పార్టీలకు త్వరలోనే తగిన బుద్ది చెబుతామని వారు హెచ్చరిం చారు. ఈ సంఘట నపై ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి విన్నవించగా బాధితులకు ఖచ్చితంగా న్యాయం చేస్తామ న్నారు. డిఎస్‌పి విచారణ చేశారని ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షిస్తామని తెలియచేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు గంగయ్య, ఏపి ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు తుంపెర రామకృష్ణ కేశేపల్లి ఆదెబ్బ, మండల ప్రధాన కార్యదర్శి మేకల రాజు, తదితరులు పాల్గొన్నారు.


కాల్చివేసిన మోటర్‌సైకిల్

# తల్లీబిడ్డల సంరక్షణే ఐసిడిఎస్ లక్ష్యం

నార్పల రూరల్, మార్చి 18 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సోమ వారం పౌష్టికాహార పక్షోత్స వాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తహశీల్దార్ లక్ష్మినారాయణ, ఎంపిడిఒ ఈసి రాముడు, సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్లు సునాలిని, మధుశాలినిలు హాజర య్యారు. ఈ సందర్భంగా తల్లీబిడ్డల సంరక్షణ ఐసిడి ఎస్ లక్ష్యమని, అదేవిధంగా ప్రీస్కూల్ బలోపేతం చేయడం పిల్లలు, తల్లిదం డ్రుల కోసం ఆట ఆధారిత ప్రదర్శన కార్యకలాపాలు తల్లిదండ్రులు పిల్లలతో కలిసి బొమ్మల తయారీ సెషన్స్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు సుధమ్మ, శ్రీదేవి, రామాం జనమ్మ, రేణుక, కళావతి, సుజాత, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

# 10వ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం కలెక్టరేట్, మార్చి 18 ప్రభాతవార్త
అనంతపురం నగరంలోని మొదటి రోడ్డులో వున్న శ్రీశారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన 10వతరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ నాదెండ్ల మనోహర్‌ను కలిసిన జిల్లా నాయకులు

అనంతపురం ఓల్డ్‌టౌన్, మార్చి 18 ప్రభాతవార్త
జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు ఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను జిల్లా జనసేన అధ్యక్షులు టిసి వరుణ్, నాయకులు కాయగూ రల లక్ష్మీపతి, చైతన్యకృష్ణలు మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం కలిశారు. గత కొన్ని రోజులుగా అనంతపురం అర్బన్ టికెట్ కేటాయింపు విషయంలో కొనసాగుతున్న సందిగ్ధతపై ఆయన్ని కలిసి మాట్లాడినట్లు వారు తెలిపారు. త్వరలో అనుకూలమైన ప్రకటన వస్తుందని ఆయన వారికి హామి ఇచ్చినట్లు పేర్కొన్నారు.


నాదెండ్ల మనోహర్‌ను కలిసిన టిసి వరుణ్, తదితరులు


కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మడకశిర రోడ్, పుష్పాంజలి థియేటర్ ఎదురుగా - అగళి - 515311
చరాస్తి యొక్క అమ్మకపు ప్రకటన
చరాస్తి వివరాలు : ఆంధ్రప్రదేశ్ - 515311, శ్రీ సత్యసాయి జిల్లా (పూర్వం అనంతపురం జిల్లా)
అగళి మండలం నరసాంబూది గ్రామ పంచాయతీకి చెందిన పి.మంజునాథ్, S/o పాండురంగప్ప, 5-97, నరసాంబూది విలేజ్ & పోస్టు అయినటువంటి ఇతను కర్ణాటక బ్యాంకు నందు వ్యక్తిగత అవసరాల నిమిత్తం కారు (Shift Desire 2018 Model) రుణము రూ.6,35,301/- పొంది ఉండినారు. సదరు రుణగ్రహీత 23-09-2022 నుండి కంతులు కట్టుట ఆపివేశారు. ఈ కారణం వలన లోన్ అకౌంట్ NPAగా పరిగణించబడినది. మొత్తం వడ్డీతో కలిపి రూ.4,89,785.70 పైసలు 24-02-2024 నాటికి బకాయి ఉంది. పలుమార్లు కట్టవలసిన లోన్ బకాయిలను ఉత్తరముల ద్వారా మరియు వ్యక్తిగతంగా హెచ్చరించినారు. అందులకు పై తెలిపిన రుణగ్రహీత సకాలంలో స్పందించకపోవడం వలన బ్యాంకు వారు కారును సీజ్ చేసి బ్యాంకు వారి ఆధీనంలో ఉంచుకొన్నాము. ఈ కారును బ్యాంకు వారు 03-04-2024 తారీఖున బహిరంగ వేలం పాట వేస్తున్నట్లు బ్యాంకు వారు తెలియజేయడమైనది. ఇట్లు
బ్యాంకు మేనేజర్, కర్ణాటక బ్యాంక్, అగళి. ఫోన్ : 8500801827


# భక్తులకు అన్నదాన కార్యక్రమం

పుట్లూరు, మార్చి 18 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీప ంలోని శ్రీమద్విరాట్ పోతలూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించారు. గత 23 సోమవారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఆదికేశవనాయుడు, కె.రామచంద్రరెడ్డి, ఆర్.ఓబులేసు, కె.గోపాల్‌రెడ్డి, ఓ.రామానుజన్‌రెడ్డి, ఎం.వెంకటరామిరెడ్డి, రామాంజనేయరెడ్డి, బండి రాజశేఖర్‌రెడ్డి, ఎంవి సుబ్బయ్య, బిజెపి శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న దృశ్యం


यूनियन बैंक Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ కార్యాలయము, అనంతపురము
బంగారు నగల వేలం ప్రకటన వేలం తేది:26.03.2024

| క్రసం | ఖాతానెంబరు | ఖాతాదారుని పేరు | బరువు గ్రా॥ |
|---|---|---|---|
| | | అశోక్ నగర్ బ్రాంచి | |
| 1. | 147716540000448 | బతం సుజాత, భర్త: బి. బాల పుల్లయ్య డోర్.నెం.12-1-228, అశోక్ నగర్, అనంతపురము. | 24.000 |
| | | బాలసముద్రము కొక్కంటి క్రాస్ బ్రాంచి | |
| 2. | 210216540003316 | పట్నం మస్తాన్ షేక్, తండ్రి: పి. ఫక్రుద్దీన్ ఖాన్, డోర్.నెం.4-39, కాల్వపల్లి గ్రామము & పోస్టు ములకలచెరువు మండలము | 5.7000 |
| 3. | 210216540003663 | పట్నం మస్తాన్ షేక్, భర్త: పి. ఫక్రుద్దీన్ ఖాన్ డోర్.నెం.4-39, కాల్వపల్లి గ్రామము & పోస్టు ములకలచెరువు మండలము | 10.700 |
| | | ముదిగుబ్బ బ్రాంచి | |
| 4. | 185416540004936 | ఆదిరెడ్డిగారి అమర్‌నాథరెడ్డి, తండ్రి: ఎ. నారాయణరెడ్డి, డోర్.నెం.8-27-ఎ, గంగిరెడ్డిపల్లి, ముదిగుబ్బ-515511 | 30.400 |
| 5. | 185416540004935 | ఆదిరెడ్డిగారి అమర్‌నాథరెడ్డి, తండ్రి: ఎ. నారాయణరెడ్డి, డోర్.నెం.8-27-ఎ, గంగిరెడ్డిపల్లి, ముదిగుబ్బ-515511 | 18.700 |
| 6. | 185416540004934 | ఆదిరెడ్డిగారి అమర్‌నాథరెడ్డి, తండ్రి: ఎ. నారాయణరెడ్డి, డోర్.నెం.8-27-ఎ, గంగిరెడ్డిపల్లి, ముదిగుబ్బ-515511 | 16.800 |
| | | హిందూపురము బ్రాంచి | |
| 7. | 768406540006282 | వి.ఎమ్. నజీరాజ, డోర్.నెం.1-2-209, అబద్‌పేట, హిందూపురము-515511 | 46.500 |
| | | గార్లదిన్నె బ్రాంచి | |
| 8. | 217016540003027 | కదవకల్లు విజయ్ భాస్కర్ రెడ్డి, తండ్రి: కె. వెంకటరెడ్డి, కనంపల్లి గ్రామము, గార్లదిన్నె. | 18.900 |

గమనిక: ఎటువంటి కారణం తెలుపకనే వేలం వాయిదా వేయుటకు గాని, పూర్తిగా లేదా పాక్షికంగా రద్దు చేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు.వేలం నియమనిబంధనల కొరకు బ్రాంచి మేనేజర్లను సంప్రదించవలెను. వేలం తేది.26.03.2024 సా॥4.30 గం॥లకు
తేది: 18.03.2024 సం/- చీఫ్ మేనేజర్, రీజనల్ ఆఫీస్, అనంతపురము


# విశేష అలంకరణలో శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రిఅర్బన్, మార్చి 18 ప్రభాతవార్త
పట్టణ సమీపంలోని పెన్నా నది తీరాన వెలసిన శ్రీబుగ్గరా మలింగేశ్వరస్వామి సోమవారం విశేష అలంకరణలో భక్తులకు దర్శనిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహి ంచి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు మహేష శర్మ, రవిశర్మ, తేజస్వామి, గంగాధర్‌శర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.


శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం

# రె బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక

తాడిపత్రిఅర్బన్, మార్చి 18 ప్రభాతవార్త
తాడిపత్రి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని స్థానిక కార్యాలయంలో సోమవారం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా బార్ అసోసియే షన్ అధ్యక్షులుగా ఆర్.రామాం జనే యులరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎవి రమణ ారెడ్డి, డి.శివయ్య, జనరల్ సెక్రటరీగా వై.శ్రీనివా సులు, ట్రెజరర్‌గా డి.శివరా మకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఎ.కుమార స్వామి, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా కె.శ్రీనివాసులు, లేడీ రెప్రసెంటేటీవ్‌గా ఎ.రాజేశ్వరి ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారికి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియచేశారు.



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

# అగాపే వృద్ధాశ్రమానికి 6 మంచాలు వితరణ

యాడికి, మార్చి 18 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో వున్న అగాపే వృద్ధాశ్రమానికి అనంతపురంకు చెందిన రిటైర్డ్ జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ ఈటె ఇజ్రాయిల్, భార్య సుశీలమ్మలు సోమవారం 6 మంచాలను వితరణ చేశారు. ఆశ్రమంలో వున్న వృద్ధులకు మంచాలు లేవని గుర్తించి దాతృత్వంతో ముందుకు వచ్చి దాదాపు 22 వేలు ఖర్చు పెట్టి 6 ఇనుప మంచాలను అందచేసినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇజ్రాయిల్ కుటుంబసభ్యులు దినేష్ రాణి తదితరులు పాల్గొన్నారు.


మంచాలు అందచేసిన దృశ్యం

# గ్రామాల్లో పర్యటించిన కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి


గ్రామంలో పర్యటిస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్(పెద్దప ప్పూ రు), మార్చి 18 ప్రభాతవార్త
పెద్దపప్పూరు మండలం కుమ్మెత, పెండేకల్లు గ్రామాల్లో సోమవారం యువనాయకులు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటింటికి తిరుగు తూ ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లోనమరోమారు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసిపి కార్యకర్తను పరామర్శించిన హర్షవర్ధన్‌రెడ్డి


ఖాదర్‌బాషను పరామర్శిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, మార్చి 18 ప్రభాతవార్త
అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న వైసిపి కార్యకర్త ఖాదర్‌బాషను సోమవారం యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. గన్నెవారిపల్లికాలనీకి చెందిన టిడిపి వర్గీయుల చేతిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న హర్షవర్ధన్‌రెడ్డి అనంతపురంకు వెళ్లి ఖాదర్‌బాషను పరామర్శించారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

## బికెఎస్‌లో ఒక విద్యార్థికి వాంతులు, విరేచనాలు - చికిత్స అనంతరం సమయంలోపే పరీక్షను రాసిన విద్యార్థి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఆర్జేడీ, డీఈవో - మొదటి రోజు 2495 మంది విద్యార్థులు గైర్హాజరు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఎస్.గౌతమి, పక్కన ఏసి గోవిందనాయక్


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి గోవర్ధన్

అనంతపురం న్యూటౌన్, మార్చి 18 ప్రభాతవార్త

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమెయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 142 పరీక్షల కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుండి 12:45 గంటల వరకు జరిగిన పరీక్ష లకు 34,074 మంది విద్యార్థులకు గాను 31,579 మంది హాజరై మిగిలిన 2495 మంది గైర్హాజరు అయ్యారని డీఈవో బి.వరలక్ష్మి, ఏసి గోవిందనాయక్ తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రతి కేంద్రం వద్ద సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఏడు రూట్లకు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయడంతో పలు కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే ఆర్జేడీ, జిల్లా అబ్జర్వర్ వై.రాఘవరెడ్డి, డీఈవో గుత్తిలో ఒకటి, పామిడిలో రెండు కేంద్రాలను తనిఖీ చేశారు.

**ఒక విద్యార్థికి వాంతులు, విరేచనాలు :** బుక్కరాయసముద్రం సమీపంలోని రోటరిపురం జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి బి.గోవర్ధన్ బికెఎస్ జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయడానికి వచ్చారు. పరీక్షలు ప్రారంభం కాకముందే వాంతులు కావడంతో స్థానిక మెడికల్ సిబ్బంది ఇంజెక్షన్ వేశారు. తర్వాత పరీక్ష రాస్తుండుగా వాంతులు, విరేచనాలు కావడంతో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, తల్లిదండ్రులు కలిసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స అందించారు. కొంత సేపటికి అంతా బాగుందని, తాను పరీక్ష రాస్తానని ఆ విద్యార్థి ఎంఈవో-1 గురుప్రసాద్‌కు చెప్పడంతో ఆయన ఉన్నతాధికారుల అనుమ తితో ప్రభుత్వం కేటాయించిన సమయంలోనే పరీక్షను పూర్తిగా రాశారని ఎంఈవో చెప్పడం జరిగింది. ఆ విద్యార్థి ఆదివారం మటన్ ఎక్కువ తిని అర్ధరాత్రి వరకు మెల్కొవడంతోనే తిన్నది జీర్ణం కాక, వాంతులు, విరేచనాలు అయ్యాయని డాక్టర్లు అధికారులకు తెలియజేశారు. అయితే ఆ విద్యార్థి ఆరోగ్యంగా పరీక్షను పూర్తిగా రాసి, మరుసటి రోజు కూడా క్రమం తప్పకుండా అన్ని పరీక్షలకు వస్తానని చెప్పడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

**విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు :** పదో తరగతి పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులకు బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు, త్రాగు నీరు, తదితర వసతులతో పాటు మెడికల్ సిబ్బందిని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులతో అందుబాటులో ఉండేలా జిల్లా విద్యాశాఖ, పరీక్షల విభాగం అధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు.

**గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు :** జిల్లా వ్యాప్తంగా 142 పరీక్షల కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు చేసి గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. చుట్టు ప్రక్కల జిరాక్స్ కేంద్రాలు, నెట్ షాపులను మూసివేయించారు.

**పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ :** నగరంలోని శారద నగరపాలక ఉన్నత బాలికల పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను జిల్లా కలెక్టర్ గౌతమి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఏసి గోవిందనాయక్‌ను ఆదేశించారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.

**ఓపెన్‌స్కూల్ పరీక్షలకు 275 మంది గైర్హాజరు :** ఓపెన్‌స్కూల్ పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 17 పరీక్షల కేంద్రాల్లో మధ్యాహ్నం 2:30 గంటల నుండి 5:30 గంటల వరకు జరిగిన పరీక్షలకు మొత్తం మంది 3360 మందికి గాను మంది 2985 హాజరై మిగిలిన 275 మంది విద్యార్థులు గైర్హజర య్యారని డీఈవో, ఏసి తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షల కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షల కేంద్రాలను, ఆర్జేడీ, డీఈవో తనిఖీ చేశారు. మొదటి రోజు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, ఓపెన్‌స్కూల్ పరీక్షలు ప్రశాంతంగా జరగడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

# బూతు స్థాయిలో కమిటీలే కీలకం..

## - బూత్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో కందికుంట


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందికుంట


హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలు

కదిరి, మార్చి 18 ప్రభాతవార్త

వచ్చే 50 రోజుల్లో ప్రతి కార్యకర్త యుద్ధంలో ఒక సైనికుడిలా పని చేయాలని టిడిపి నియోకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ సమీపంలోని పివిఆర్ గ్రాండ్‌లో బూత్ కమిటీ, ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందికుంట వెంకట ప్రసాద్ హాజరయ్యారు. ఈ మేరకు కందికుంట మాట్లాడుతూ.. గత నాలుగున్నర సంవత్సరాలుగా అరాచక ప్రభుత్వంలో ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు వచ్చే 50 రోజులు బూత్‌స్థాయి నుంచి ప్రతి కార్యకర్త యుద్ధంలో ఒక సైనికుడిలా పని చేసే అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపి టిడిపి జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వం అధికారం తేవడానికి కృషి చేయాలన్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డబ్బు సంచులతో నియోజకవర్గంలోకి ఎలాగైనా తన టికెట్ ఇప్పించి అభ్యర్థిని గెలిపించడం కోసం అడ్డదడ్డుగా వస్తారని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ వారి ఎత్తుగడులను తిప్పి కొట్టాలని శ్రేణులకు సూచించారు. నాలుగు సంవత్స రాల తొమ్మిది నెలల కాలం పాటు మీరు చూపిన పోరాటం యుద్ధంలో సైనికుల పనపి చేశారన్నారు.

కార్యకర్తలు ఆస్తులను పోగొట్టుకున్నారని అయినా కూడా జెండాను వదలలేదన్నారు. మీ కష్టం వృథా కాకుండా చూస్తానని సందర్భం గా ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో వైకాపా ప్రభుత్వం అవలంబి స్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ గెలుపుకు కృషి చేయాలని పిలుపుని చ్చారు. ఎన్నికలను సజావుగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత మనం దరిపై ఉందన్నారు ఉండాలన్నారు. 20 సంవత్సరాలపాటు నీతో పాటు పార్టీని నడిపించే విధంగా ముందుండి పోరాటాలు చేశానన్నారు. కష్ట కాలంలో పార్టీ జెండా మోసిన వారిని గుర్తిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గడిచిన రెండు ఎన్నికల్లో ఓటమి చెందామని ఒక ఎన్నిక నిర్లక్ష్యంతో మరో ఎన్నికల ప్రజలు తిరస్కరించారన్నారు. ఈ రెండింటికి సమాధానం చెప్పే రోజులు దగ్గరే ఉన్నాయన్నారు. ఎన్నికల్లో గెలవబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. సంకల్పం పట్టుదలతో ఎన్నికల్లో గెలిచి తీరుతామన్నారు. అపోహలు ఆలోచనలకు తావియ్య కుండా ముం దుకు వెళ్లాలన్నారు. అభ్యర్థి ఎవరైనా సరే గెలవాలని ఆలోచన ఉండాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో సాంకేతి కతను అలవర్చు కోవాలన్నారు. కొంత మంది విషయం నింపే కార్యక్రమాలు చేసున్నారని వాటన్నింటిని తిప్పి కొట్టాలన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడి వారందరిని గుర్తించి వచ్చే రోజుల్లో పెద్ద పీట వేస్తామన్నారు. నామినేషన్ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చే విధంగా చొరవ తీసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. త్వరలోనే ప్రచార షెడ్యూల్ ప్రకటిస్తామని మండల గ్రామ మండల స్థాయి నాయకులు కూర్చొని ప్రచార కార్యక్రమాలు ఏ విధంగా చేపట్టాలి తీసుకోవాల్సిన అంశాలు ప్రజల కు వివరించే అంశాలపై పూర్తి స్థాయిలో కార్యచరణ చేపట్టాలని పిలుపునిచ్చారు.

# నేడు చంద్రమౌళీశ్వరుని మహా రథోత్సవం

## - విద్యుత్ దీపకాంతులతో విరాజిల్లుతున్న గవిమఠం, ప్రధాన రోడ్డు - మఠం ఆవరణంలో వెలసిన జాయింట్ వీల్స్, వివిధ దుకాణాలు - వివిద రాష్ట్రాల నుండి వేలాదిగా తరలివస్తున్న భక్తజనం


విద్యుత్ దీపకాంతుల నడుమ ఉరవకొండ గవిమఠ సంస్థానం


ముస్తాబవుతున్న చంద్రమౌళీశ్వరుని బ్రహ్మరథం


గవిమఠం ఆవరణలో వెలసిన జాయింట్ వీల్ తదితర దుకాణాలు

ఉరవకొండ, మార్చి 18 ప్రభాతవార్త

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలలోనే ప్రసిద్ది చెందిన ఉరవకొండ పట్టణం లోని గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి మహా రదజోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈనెల 14వ తేది నుండి ప్రారంభమైన చంద్ర మౌళీశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం పాల్గుణ శుద్ధ దశమి మంగళవారం (నేటి) సాయంత్రం 4:35 గంటలకు మహా రథోత్సవం జరుగనుండటంతో రథాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. రథోత్సవం అనంతరం సాయంత్రం 6.30 గంటల నుండి 8.00 గంటల వరకు భక్తి ప్రవచనములు కార్యక్రమం అనంతరం 'అమ్మ తొలిదైవం' సాంస్కృతిక స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు పాటిల్ రాజశేఖర్ (పోలీస్ కమ్యూనికేషన్స్ ఎస్ఐ) నేతృత్వంలో సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. రథోత్సవ కార్యక్రమానికి జిల్లా, రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి కూడా పెద్దఎత్తున భక్తులు తరలి రానుండటంతో ఎవ్వరికి ఎలాంటి ఇబ్బందులు కలు గకుండా మఠం ప్రాంగణంలో ఉత్సవాల ప్రారంభానికి ముందు నుంచే చలువ పందిళుల ఏర్పాట్లు చేశారు. గవిమఠాన్ని, మఠానికి వెళ్లే ప్రధాన రహదారిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. మహా రథోత్సవ కార్యక్రమానికి దాదాపు లక్షమందికి పైగానే భక్తులు మహా రథోత్సవానికి హాజరవుతారని అంచనాలు ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఉరవ కొండ యుపీఎస్, రూరల్ సీఐలు సురేష్‌బాబు, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రాఘవేంద్రప్ప ఆధ్వ ర్యంలో వివిధ సర్కిళ్లకు చెందిన సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా మఠం ప్రాంగణంలో అందరినీ ఆకట్టుకునే భారీ జాయింట్స్ వీల్స్, ఊయళ్లు, పిల్లల ఆటవస్తువుల, గృహోపకరణాలకు చెందిన దుకాణాలు వెలిశాయి.

# కణేకల్లు చెరువు పూడికతీతతో సామర్థ్యం పెరిగింది.... రాయదుర్గం తెదేపా అభ్యర్థి కాలవ


తన 49వ సెల్ఫీని దిగుతున్న మాజీ మంత్రి కాలవ

కణేకల్లు, మార్చి 18 ప్రభాతవార్త:

శతాబ్దాల చరిత్ర కలిగిన కణేకల్లు చిక్కనేశ్వర చెరువులో పూడికతీత పనులను తన హయాంలో చేపట్టామని రాయదుర్గం టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50వారాల సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా కణేకల్లు చెరువు పై సోమవారం ఆయన 49వ సెల్ఫీ వీడియోను విడుదల చేశా రు. వందల ఏళ్ల కిందట నిర్మించిన చెరువులో పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. తద్వారా ఆ చెరువు ఆయకట్టు అవస రాలు తీరక రైతులు ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. టిడిపి హయాంలో చెరువులో పూడిక తీత పనుల కోసం రూ.2కోట్లు మంజూరు చేశామన్నారు. చాలా వరకు పనులను చేశామన్నారు. కణేకల్లు ప్రాంత రైతుల విజ్ఞప్తి మేరకు రెండో పంటకు సాగునీరు అందించడం కోసమే పూడిక తీతపై ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. రైతుల కోసం వేదావతి నది గర్భంలో సబ్ సర్ఫేస్ డ్యాములను కూడా నిర్మించామన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా అనేక చెక్ డ్యాంలతో పాటు పంట కుంటలను నిర్మించామని తెలిపారు. రైతు మేలు కొరకు చంద్రబాబు ఆశీస్సులతో ఆనాడు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రైతు బాగు కోసం ఒక్కటైన మంచి చేసిందా అని ప్రశ్నించారు. రైతు సంక్షేమ పథకాలన్ని రద్దు చేసిన జగన్‌మో హన్‌రెడ్డి రైతు ద్రోహిగా చరిత్రలో శాశ్వత స్థానాన్ని దక్కించుకున్నాడని ఆయన దుయ్యబట్టారు. రైతు ఓట్లతో రాజ్యమేలుతున్న జగన్‌రెడ్డి రైతులను నిలువునా ముంచుతున్నాడన్నారు. రెండు నెలల్లో జరిగే సాధారణ ఎన్నికల్లో వైసీపీని గద్దెదించే అవకాశం ప్రజలకు వచ్చిందన్నారు. ప్రజలందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆనంద్‌రాజులు, హనుమాపురం సర్పంచ్ జయరామచౌదరి, కవిత్‌మాబు, మిల్ చంద్రశేఖ ర్‌గుప్తా, వెంకటేష్ చౌదరి, రైతు డిపో చాంద్‌బాషా, మాల్యం అశోక్, శరబన్నగౌడ, నెంబర్ నాగభూ షణం తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి - పల్లె సింధూర రెడ్డి


ఎన్నికల ప్రచారంలో నాయకులతో కలిసి పాల్గొన్న పల్లె సింధూరరెడ్డి.

కొత్తచెరువు మార్చి 18 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీళ్ల ఇవ్వడమే నా ప్రథమ లక్ష్యమని పుట్టపర్తి టిడిపి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి పెర్కోన్నారు. సోమవారం కొత్తచెరువు మండలంలోని నాగిరెడ్డి పల్లి.ఇరంగంపల్లి గ్రామాల్లో భర్త వెంకటకృష్ణకిషోర్ రెడ్డితో పాటు టిడిపి నాయకులు సాలక్కగారి వాణిశ్రీనివాస్ మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు,రామకృష్ణ ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేస్తు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్గీ తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలుచేస్తాయని, టిడిపి అధికారంలోకి రాగానే పేదప్రజలను ఆర్ధికంగా ఆదుకోడానికి ఈ పథకాలు ఎంతగానో దోహదపడతాయ న్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోడానికి పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు ఏటా 20వేలు పెట్టుబడి సహయం అందిచనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 50 ఏళ్ళ పైబడిన బీసిలకు ప్రతినెల ఫెన్షన్‌లు ఇచ్చె విధంగా చంద్రబాబు ఆచరణలో పెట్టారని గుర్తుచేశారు. ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా అందిస్తారన్నారు. వెనుకబడిన పుట్టపర్తి నియోజ కవ ర్గంలోని అన్ని చెరువులు హంద్రినివా ద్వారా నీళ్ళు తీసు కొచ్చి సాగునీరు, త్రాగు నీరు అందిస్తామ న్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళికలు రూపోందిస్తా మన్నారు. టిడిపి అధికారంలోకి వస్తూనే అటు ఏపి ఇటు పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి అవుతుందన్నారు .భావితరాలకు భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అందుకే రానున్న ఎన్నికలలో ఉమ్మడి బిజెపి, జనసేన పార్టిలలో అదికా రంలోకి తేవడం కోసం ప్రతిఒక్కరూ కృషి చెయ్యాలన్నా రు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ ఎంపిటిసి సురేష్‌నాయుడు, సర్పంచ్‌లు వేంకటేష్, ఆంజనేయులు, కిష్టప్ప, కేశవ, రవి, తెలుగుయువత అధ్యక్షుడు హర్ష, కిరణ్, తెలుగు మహిళా నాయకురాలు మాధవి, రాధమ్మ, లావణ్య, టిడిపి కార్య కర్తలు, అబిమానులు పాల్గొన్నారు.

# రెండు పడవలపై ప్రయాణం చేస్తున్న పార్టీ బిజెపి

## - వైకాపా పార్టీపై మమకారం చూపిస్తున్న మోదీ - సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్


మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్

అనంతపురం, మార్చి 18 ప్రభాతవార్త బ్యూరో

ప్రధాని నరేంద్రమోదీ నిన్న జరిగిన చిలకలూరు పేట సమావేశంలో మాట్లాడిన తీరును బట్టి రెండు పడవలపై ప్రయాణిస్తున్న బిజెపి పార్టీని చూస్తుంటే సిగ్గుగా ఉందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్ పేర్కొన్నారు. సోమవారం సిపిఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలకలూరు పేట లో జరిగిన సమావేశంలో నరేంద్రమోదీ జగన్‌మోహన్‌రెడ్డి విధానాల పట్ల ఏమాత్రం తప్పు పట్టకుండా ప్రసంగించారన్నారు. పార్లమెంట్‌లో రైల్వే జోన్ రాకపోవడానికి జగనే కారణమని రైల్వే శాఖ మంత్రి చెప్పినా కూడా నరేంద్ర మోదీ చెప్పకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. దీన్ని బట్టి చూస్తుంటే వైఎస్ఆర్‌సిపి పట్ల ఆయనకున్న మమకారాన్ని చంపుకోలేక పోతున్నాడన్న విషయాన్ని ఈ సభ ద్వారా నిరూపితమైం దన్నారు. తెలుగు దేశం పార్టీతో బిజెపికి ఉన్న పొత్తును సంకోచిచాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపికి విధిలేక టిడిపి, జనసేనలతో జతకట్టి పని చేస్తున్నారన్నారు. గతంలో కూడా ఈ డబుల్ ఇంజన్‌సర్కారులతో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు నరేంద్ర మోద అనుసరి స్తున్న ద్వంద వైఖరిని గుర్తించాలని సిపిఐ తరపున కోరుతున్నామన్నారు.

**అనంతపురం అర్బన్ నుంచి సిపిఐ పోటీ..**

ఆదివారం గుత్తిలో వీరభద్రస్వామి అధ్యక్షతన జరిగిన సిపిఐ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగిందన్నారు. అనంతపురం అర్బన్ స్థానానికి సిపిఐ పార్టీ పోటీ చేయాలని జిల్లా కార్యవర్గం ప్రతిపాదించిందన్నారు. ఈ ప్రతిపాదనలో అనంత జిల్లా అభ్యర్థులుగా జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి పేర్లను ప్రతిపాదన చేసి రాష్ట్ర పార్టీకి ఇవ్వడం జరిగిందన్నారు. రానున్నటువంటి ఎన్నికల్లో కలిసి వచ్చే కాంగ్రెస్, సిపిఎం పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర కార్యదర్శి చెప్పడం జరిగిందన్నారు. సిపిఐ అభ్యర్థిని ప్రకటించిన వెంటనే వారిని గెలిపించే దిశగా పని చేస్తామన్నారు. జిల్లా కార్య దర్శి జాఫర్ మాట్లాడుతూ.. భారతీయ జనతాపార్టీ అధికారంలో వచ్చిన 10 సంవత్సరాల కాలంలో ఎన్నికల బాండ్ల పేరు మీత వ్యాపారం చేశారన్నారు. సుప్రీం కోర్టు ఐదు మంది న్యా యమూర్తుల ద్వారా తీసుకు న్నటువంటి నిర్ణయాన్ని యావ త్ భారతదేశం వ్యాప్త ంగా హర్షం వ్యక్తం చేశార న్నా రు. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని సిపిఐ పార్టీ స్వాగతిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని పక్కదోవ పట్టించడానికి కేంద్ర ప్రభుత్వం సిఏఏ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. సిఏఏ చట్టంపై చిత్తశుద్ది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలపై వ్యతిరేకమని అభిప్రాయ పడుతున్నామన్నారు. సిపిఐ, సీపీఎం లిబరేషన్ పార్టీలు, ఎన్నికల బాండ్లను స్వీకరించము అన్న విషయా న్ని ధైర ్యంగా చెప్పిన పార్టీ సిపిఐ అని పేర్కొ న్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శిలు పి.నారాయ ణస్వా మి, సి.మల్లికార్జున, సిఐటి యుసి జిల్లా అధ్యక్షులు రాజేస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూపురంలో వైసిపిదే గెలుపు - నాయకుల ఐక్యతారాగం


మీడియాతో వైసిపి నాయకులు

హిందూపురం, మార్చి 18 ప్రభాతవార్త

ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో హిందూపురం ఎమ్మెల్యే, ఎంపి స్థానాల్లో వైసిపి గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వైసిపి గ్రూపు నాయకులంతా ఒకే వేదికపైకి వచ్చి ఐక్యతరాగం వినిపించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు నవీన్‌నిశ్చల్, ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, ఎంపి అభ్యర్థి శాంతమ్మ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌గని, మధుమతిరెడ్డి, మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడారు. నవీన్ మాట్లాడుతూ సూర్యుడు ఇటు పుట్టే బదులు అటు పుట్టిన కూడా ఈ సారి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల గెలుపును హిందూపురంలో ఎవరూ ఆపలేరని సవాల్ చేశారు. 40 ఏళ్లుగా ఇక్కడ టిడిపి ఎమ్మెల్యేలు గెలవడానికి కారణం వాళ్ల బలం కాదు మా బలహీనతలే అన్నారు. 2014, 2019 ఎన్నికల్లో కేవలం 10 శాతం ఓటింగ్ మాత్రమే రెండు పార్టీలకు తేడా వుందని ఈ సారి అందరూ ఐక్యంగా పనిచేసి వైసిపి అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. కొండూరు వేణు మాట్లాడుతూ వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు వంద శాతం గ్యారెంటీ అన్నారు. హిందూపురంలో వైసిపిని గెలిపించుకుని మంత్రి పెద్దిరెడ్డికి బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కొల్లకుంట ఆనందరెడ్డి, శ్రీరామరెడ్డి, ఎంహెచ్ రామాంజి, మార్కెట్‌యార్డుచైర్మన్ ఫిర్దోస్‌ఖలీల్, కన్వీనర్లు రాము, నారాయణస్వామి, చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తంరెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, మహేంద్రనాథ్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు వాల్మీకి లోకేష్, కౌన్సిలర్లు శివకుమార్, ఆసిపుల్ల, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఎంపికైన నవీన్‌కు ఈ సందర్భంగా పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# సంక్షేమ సారధికి మరోసారి పట్టం కట్టండి

## ఎంఎల్ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


ఇంటింటి ప్రచారంలో ఎంఎల్ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి, మార్చి 18 ప్రభాతవార్త

రాష్ట్రంలో సంక్షేమపాలనను ప్రజలకు అందించిన ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైకాపా ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల లో మరోసారి ఆశీర్వదించి పట్టం కట్టాలని కోరుతూ ఎంఎల్ఏ కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని తంభాపురం గ్రామంలో ఎంఎల్ఏ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా గ్రామ ంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుండి పొందిన లబ్ధిని వారికి వివరిం చారు. మరోసారి రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పాలన జరగాల ంటే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంఎల్ఏగా తనను గెలిపించే బాధ్యత ప్రజలపైనే వుందన్నారు. అంతకు ముందు గ్రామా నికి వచ్చిన ఎంఎల్ఏకు నాయకులు, కార్యకర్తలు ఘణస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సానే జయచంద్రారెడ్డి, మండల కన్వీనర్ జయరామిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన రమణారెడ్డి


జడ్పి డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు చేపడుతున్న రమణారెడ్డి

అనంతపురం సిటీ, మార్చి 18 ప్రభాతవార్త

జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా రమణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో డిప్యూటీ సీఈఓగా పని చేస్తున్న రమణారెడ్డి డ్వామా విజిలెన్స్ విభాగం అధికారిగా బదిలీపై వెళ్లారు. తిరిగి ఆయనను డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ ఇటీవల కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన రమణారెడ్డి జడ్పి సిఈఓ మిదియా దేవిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైసీపీ పాలనలో ఎస్సీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత - అర్బన్ ఎమ్మెల్యే అనంత


ఎమ్మెల్యే అనంతను సన్మానిస్తున్న ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బంగి సుదర్శన్

అనంతపురం సిటీ, మార్చి 18 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమానికి అత్యధికప్రాధాన్యత ఇస్తున్నాం ని, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బంగి సుదర్శన్‌సోమవారం అర్బన్ ఎమ్మెల్యే అనంత వె ంకటరామిరెడ్డిని కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సత్కరిం చారు. తన ఎంపికకు సహకరించినందుకు ఈ సంద ర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞత లుతెలిజయేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజ్యాంగ బద్ద పదవులతోపాటు నామినేటెడ్ పదవుల్లో ఎస్సీలకు వైసీపీ పాలనలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వై సీపీ పాలనలో ఎస్సీల సంక్షేమం, అభివృద్ధి కోసం జరుగుతున్న కృషజని ఆయా వర్గాల నుంచి నిషజతంగా తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు నాగార్జు నరెడ్డి, తలారి వెంకటేష్, ముత్యాలప్ప, రామకృష్ణ, నాణి, వెంకటరెడ్డి, అలీ ఖాన్, బాబావలి, గూడూరు రవి, రాగంశెట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు తీసుకుంటూ సరైన ఆహారం అందించకుంటే ఎలా

## - ప్రైవేట్ హాస్టల్ నిర్వహకులపై ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మణ్‌కుమార్


ఆహారాన్ని తనిఖీ చేస్తున్న లక్ష్మణ్‌కుమార్

అనంతపురం సిటీ, మార్చి 18 ప్రభాతవార్త

విద్యార్థుల నుంచి హాస్టల్ రూపేనా వేలాది రూపాయలు తీసుకుంటున్నా నాణ్యమైన ఆహారాన్ని అందించకుంటే ఎలా అని ప్రైవేట్ హాస్టల్స్ నిర్వహకులపై ఫుడ్ సేఫ్టీ అడ్వైజర్ లక్ష్మణ్‌కుమార్ మండి పడ్డారు. నగరంలోని పద్మావతి నర్సింగ్ కాలేజీలో ఇటీవల ఫుడ్ పాయిజన్‌తో పలువురు విద్యా ర్థినీలు అస్వస్థతకు గురయ్యారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ అడ్వైజర్ లక్ష్మణ్ కుమార్ పద్మావతి నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో మాట్లాడారు. అదే విధంగా హాస్టల్ లోని ఆహారాన్ని, ఆహారానికి తయారీకి వాడుతున్న ఇతరాత్ర వస్తు వులను పరిశీలించారు. బాధిత విద్యార్థులను మాట్లాడారు. ఈసం దర్భంగా మెనూ ఏ మాత్రం పాటించడం లేదని అన్నం సరిగా ఉడికించడం లేదని, చెడిపోయిన కూరగాయలు వాడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వేలాది రూపాయలు హాస్టల్ బిల్లులు చెల్లిస్తున్నా సరైన ఆ హారం అందించడం లేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పంది ంచిన ఆయన మెనూను పా టించడంతోపాటు విద్యార్థు లకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నిర్వహకులకు సూచించారు. అంతేకా కుండా ఇక్కడి పరిస్థితిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు.

# మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


మాజీ సర్పంచ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, మార్చి 18, ప్రభాతవార్త : మ ండలంలోని తుమ్మలకుంట్లపల్లికి చెందిన మాజీ సర్పంచ్ రెడ్డప్పనాయుడును పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. రెడ్డెప్పనాయుడు ఇటీవల అనారోగ్యానికి గురై బెంగళూరుకు వెళ్లి చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రెడ్డెప్ప ఇంటికి వెళ్లి ఆరోగ్యపరిస్థితులపై చర్చించారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పునరంకితులవ్వాలని అకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట కన్వీనర్ రాజునాయుడు, రాష్ట్రమైనార్టీ కార్యదర్శి షామీర్‌బాష, నియోజకవర్గ పరిశీలకులు భాస్కర్‌రెడ్డి, అగ్రి అడ్వజరీ ఛైర్మెన్ లక్ష్మిరెడ్డి, చంద్రమౌళితో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**నేడు టి కుంట్లపల్లిలో వైఎస్సార్‌సి ఎన్నికల ప్రచారం :** నేడు(మంగళవారం) మండలంలోని టి కుంట్లపల్లి నుండి వైఎస్సార్‌సిపి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు కన్వీనర్లు రాజునాయుడు, క్రిష్టారెడ్డిలు ఒక ప్రకటనలో తెలియచేశారు. పుట్టపర్తి ఎమ్మెల్యే, వైస్సార్‌సిపి అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కుంట్లపల్లి, ఠానా కొత్తపల్లి, తాటి మేకలపల్లి, బసప్పగారిపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో పర్యటించనున్నట్లు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కావున వైసిపి శ్రేణులు ఇతర అనుబంధ సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.